
# సత్యవాక్కు




క్రైస్తవ మాస పత్రిక

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

ప్రతేటా నిర్వహించుచున్న

# గొప్ప బైబిలు సెమినార్

## 1992 డిశంబరు 7 నుండి 13 వరకు

ఉపన్యాసకులు : **Bro.** జె.బి. టోట్టెర్, రేటవున్, **U.S.A.**
**Bro.** పెర్రి కోతమ్, **U S.A.**
**Bro.** జాన్ ఫోర్డ్, **U.S A.**
మరియు తదితర స్వదేశ విదేశ సహోదరులు.
ప్రతిరోజు ఉదయం 10 గం॥లకు, మధ్యాహ్నం
3 గం॥లకు మరియు సాయంత్రం 7 గం॥లకు.

స్థలం : క్రీస్తు సంఘము - సత్యవాణి కార్యాలయము
(బెయిలీ బిల్డింగ్)
సాంబమూర్తి వీధి
పశువుల ఆసుపత్రి దగ్గర
రామారావు పేట, కాకినాడ - 4

మీరు రండి. మీతో మీ బంధువులను మిత్రులను తీసికొని రండి. మీ సంఘ సభ్యులను తీసికొని రండి. వచ్చే వారందరికీ ఉచిత భోజన, వసతి సౌకర్యము లున్నవి. అందరూ వచ్చి బైబిలు సత్యములను గ్రహించండి. ఈ గొప్ప ఆత్మీయ విందు, సహవాసములను మాతో పంచుకొనండి. మీ కిదే మా ఆహ్వానం. వివరాలకు ఈ దిగువ సంప్రదించండి :

Director
Kakinada School of Preaching
Seshagiri Rao St., Kakinada – 533 004
Ph : 0884 – 74882

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 13 | అక్టోబరు 1992 | సంచిక 3

## సంపాదకీయము

### దేవునియొక్క కుటుంబము

### ( The Lord's Family )

"కుటుంబము" అనగానే ఈ లోక సంబంధమైన కుటుంబమును గూర్చి మనకు తలంపు కలుగును. భర్త, భార్య, బిడ్డలు కుటుంబములో యుందురు. భర్త లేక తండ్రి కుటుంబమునకు లేక యింటికి పెద్దగా యుండును. భార్య మరియు తల్లి, బిడ్డలతో కలసి భర్తకు లోబడి యుందురు. చాల ప్రదేశములలో భర్తయొక్క ఆధిక్యతను బట్టి కుటుంబములోని వారంతా వాని పేరునే పెట్టుకొందురు.

కుటుంబ క్షేమము కొరకు ఆ కుటుంబములోని వారందరూ వారివారి పనులను, బాధ్యతలను నిర్వర్తించుచుందురు. క్రమశిక్షణ కలిగినట్టి, బాధ్యత గలిగినట్టి స్త్రీ, పురుషులు తమ బిడ్డలు పెరుగుటకు గాను తగినట్టి కాపుదలను యిచ్చుచూ వారిని పోషించుటకు తల్లిదండ్రులు తోడ్పడుచుందురు. ఆ కాలమంతటిలోను వారందరూ కలసి

యుండి ఒకరియెడల ఒకరు ప్రేమగలిగి, ఒకనినొకరు సమర్థించు
కొనుచూ, ఒకరికొకరు సహాయము చేసికొనుచూ యుందురు.
వారందరు ఐక్యతతో కలసి యుందురు గనుక వారు చాల బలవంతు
లుగ యుందురు. వారి దేశమునకును, వారి జనాంగమునకును ఒక
పెద్ద సంరక్షణగ వారుండినట్లుందురు.

బలమైన కుటుంబముగ వారుండినందున వారి సమస్య లన్నియు
వారందరు కలసియే పరిష్కారము చేసికొందురు. ఎవరైనా వారి
వ్యతిరేకముగ యుండినచో వారుకూడ వ్యతిరేకించుదురు. కుటుంబ
సమస్యలేమైనా యుండినచో వారిలో వారే ఆ సమస్యలను
పరిష్కారము చేసికొన ప్రయత్నింతురు. వారిలో ఒకరికొకరు హాని
చేసుకొనుటగాని, ఒకరియెడల ఒకరు చెడుగు చెప్పుటగాని, లేక వారి
స్నేహితుల దగ్గర కుటుంబ సమస్యలను చిన్నచూపు చూచుటగాని
చేయరు. వారిలో వారే ఒకరి యెడల ఒకరు చాల ప్రేమ గలిగినవారై
యుండి యితరుల విషయములను గూర్చి, వారి సమస్యలనుగూర్చి
లేక వారి కొరతలనుగూర్చి ముచ్చటించుకొనుచుందురు.

ఆత్మీయముగ దేవునికి కూడ ఒక కుటుంబము గలదు. పౌలు
ఎఫెసులోని క్రైస్తవులకు ఈ విధముగా వ్రాయుచున్నాడు : "ఈ
హేతువుచేతను పరలోకమందును, భూమిమీదను ఉన్న ప్రతి కుటుం
బము ఏ తండ్రిని బట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రి యెదుట
నేను మోకాళ్ళూని మీరు అంతరంగ పురుషుని యందు శక్తికలిగి
ఆయన ఆత్మ వలన బలపరచబడునట్లుగాను..." (ఎఫెసి 3 : 14-15).
తిమోతికి ఈ విధముగా వ్రాయుచున్నాడు: అయినను నేను ఆలస్యము
చేసినయెడల దేవుని మందిరములో, అనగా జీవముగల దేవుని సంఘ
ములో, జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని ఈ
సంగతులను నీకు వ్రాయుచున్నాను (1 తిమోతి 3:15). ఈ వాక్యము

లోని "దేవుని మందిరములో" అను మాట దేవుని కుటుంబమును సూచించుచున్నది. దీనిని మనసునం దుంచుకొని ఈ వాక్యమును చదువుదుము. అయితే క్రీస్తు కుమారుడై యుండి, ఆయన యింటిమీద నమ్మకముగా యున్నాడు; ధైర్యమును, నిరీక్షణవలన ఉత్సాహమును తుదమట్టుకు చేపట్టిన యెడల మనమే ఆయన యిల్లు (హెబ్రీ 3:6). ఇది వ్రాసినవాడు వారే ఆ యిల్లై యున్నారని అనగా తానును, తాను ఏ క్రైస్తవులకు యిది వ్రాయుచున్నాడో వారున్ను అని మనము గమనించవలెను. వారు యేమైయున్నారు? వారు దేవుని యిల్లై యున్నారు లేక దేవుని కుటుంబమై యున్నారు. క్రీస్తు ఆ యింటి మీద యున్నాడు లేక కుటుంబమునకు పెద్దయై యున్నాడని గ్రహించుము.

అయితే ఆ యిల్లు యేమిటి? 1 తిమోతి 3:15 లో చదివిన ప్రకారము అది జీవము గల దేవుని సంఘము. అది కుటుంబము లేక సంఘము; అదేరీతిగా హెబ్రీ 3:6లో కూడ మనము చదువగలము. క్రీస్తును గూర్చి పౌలు మాట్లాడుచూ యిట్లు చెప్పుచున్నాడు; మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది. (ఎఫెసి 1:22-23). అతడింకను యిట్లు చెప్పుచున్నాడు. క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు. సంఘము క్రీస్తునకు లోబడినట్టుగా భార్యలు కూడ ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడవలెను. పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి; అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి, అది కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి యేదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమ

గల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొన
వని, వాక్యముతో ఉదకస్నానము చేత దానిని పవిత్రపరచి,
శుద్ధ పరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను (ఎఫె
5:23-27). ఇచ్చట క్రీస్తును, సంఘమును భార్య భర్తలకు ఒకరియె
డొకరికి యుండు ప్రేమతో ఈ రచయిత సరిపోల్చుచున్నాడు. భార్య
శరీరసంబంధమైన భర్తకు లోబడినట్లుగా సంఘముకూడ క్రీస్తు
లోబడవలెనని చెప్పుచున్నాడు.

దేవుని సంఘమును గూర్చి మనము ఆలోచించునపుడు ఈ
ఇహలోక సంబంధమైన కుటుంబముతోను, క్రీస్తు పెండ్లి కుమారుడు
లేక పెద్దగ, సంఘము పెండ్లికుమార్తెగ సరిపోల్చబడినట్లు మనము
తెలుసుకొనవలెను (యోహాను 3:29; ప్రకటన 21:2, 9, ప్రక
22:17). ఇంకను చూచినట్లయిన పెండ్లికుమార్తె లేక సంఘము అన్ని
విషయములలోను క్రీస్తుకు లోబడవలెను. ఎవరైతే సువార్త
అంగీకరించిరో, వారు లేక ఆ బిడ్డలు వాక్యమునకు లోబడిరో వా
ఆయన రక్షించి సంఘమునకు లేక ఆయన కుటుంబములోనికి చేర్చు
కొనును. మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదిన
వారితో చేర్చుచుండెను (అ. కా. 2 : 47; మార్కు 16 : 15-16
యోహాను 3 : 3-5 లోని వాక్యముల భావమును బట్టి క్రీస్తు ద్వా
ఆత్మీయ జననము లేక ప్రభువు రాజ్యములోనికి పుట్టుటగ చెప్ప
గలతీయులోని క్రైస్తవులకు పౌలు ఈ విధముగ వ్రాయుచున్నా
యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై
యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును
ధరించుకొని యున్నారు (గలతీ 3:26-27).

ప్రభువుకు ఒకే కుటుంబము లేక సంఘము గలదు. దానికి ఆ
పతిగ ఆ సంఘసభ్యు లందరిని అన్ని విషయములయందును ఆయ

నడిపించుచుండును. ప్రభువును సేవించుటలో ఆ సభ్యు లందరు మంచి ఐక్యత కలిగియుండవలెను. కొరింథులోని క్రైస్తవులకు సంఘము-సభ్యులు వారి ఐక్యత భౌతిక సంబంధమైన శరీరము దానిలోని అవయవములకు సరిపోల్చి పోలు చెప్పుచున్నాడు. ఎట్లనగా "ఏలాగు శరీరము ఏకమైయున్నను అనేకమైన అవయవములను కలిగియున్నదో, యేలాగు శరీరముయొక్క అవయవము లన్నియు అనేకములై యున్నను ఒక్క శరీరమై యున్నవో, ఆలాగే క్రీస్తు ఉన్నాడు. మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మ యందే బాప్తిస్మము పొందితిమి. యూదులమైనను, గ్రీసు దేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మనమందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మ యందే బాప్తిస్మము పొందితిమి. మనమందరము ఆ ఒక్క ఆత్మను పానము చేసినవారమైతిమి. శరీరమొక్కటే అవయవముగ ఉండక అనేకమైన అవయవములుగ యున్నది. నేను చెయ్యనికాను గనుక శరీరములోనిదానను కానని పాదము చెప్పినంత మాత్రమున శరీరములోనిది కాకపోలేదు. శరీరమంతయు కన్నయితే వినుట యెక్కడ? అయితే దేవుడు అవయవములలో ప్రతి దానిని తన చిత్త ప్రకారము శరీరములో ఉంచెను. అవన్నియు ఒక్క అవయవమైతే శరీర మెక్కడ? అవయవము లనేకములైనను శరీర మొక్కటే. గనుక కన్ను చేతితో నీవు నాకక్కర లేదని చెప్పజాలదు; తల పాదములతో మీరు నాకక్కర లేదని చెప్పజాలదు. అంతేకాదు, శరీరముయొక్క అవయవములలో ఏవి మరి బలహీనములుగా కనబడునో అవి మరి అవశ్యములే. శరీరములో ఏ అవయవములు ఘనత లేనివని తలంతుమో ఆ అవయవములను మరి యెక్కువగా ఘనపరచుచున్నాము. సుందరములు కాని మన అవయవములకు యెక్కువైన సౌందర్యము కలుగును. సుందరములైన మన అవయవములకు యెక్కువ సౌందర్యమక్కరలేదు. అయితే శరీరములో వివాదములేక, అవయవములు

ఒకదాని కొకటి యేకముగా పరామర్శించులాగున, దేవుడు తక్కువ దానికే యెక్కువ ఘనత కలుగజేసి, శరీరమును అమర్చియున్నాడు. కాగా ఒక అవయవము శ్రమపడునపుడు అవయవము లన్నియు దానితో కూడ శ్రమపడును. ఒక అవయవము ఘనత పొందునపుడు అవయవము లన్నియు దానితో కూడ సంతోషించును. అటువలె, మీరు క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరువేరుగా అవయవములై యున్నారు" (1 కొరింథి 12 : 12-27). భౌతికమైన శరీరములో అవయవము లన్నియు కలసి శరీర క్షేమముకొరకు యేలాగు పని చేయునో ఆలాగే క్రీస్తు శరీరమనెడి సంఘములోని సభ్యులందరు సంఘ క్షేమాభివృద్ధి కొరకు కలసి పనిచేయవలెను. సంఘ సభ్యులు ఒకరికొకరు ఎదురాడక, అసూయ పడక, సంతోషించువారితో సంతోషించుచు ఏడ్చువారితో ఏడ్చుచు ప్రభువు కొరకు మంచి ఫలములు ఫలించగలుగుటకు కలసి పనిచేయవలెను.

మనము తెలుసుకొనిన రీతిగా ప్రభువు శరీరమైన సంఘము ఆయన పేరును ధరించవలెను. అ. కా. 11:26; అ. కా. 26:28; 1 పేతురు 4:16 లలో చెప్పబడిన రీతిగా మనలో ప్రతి ఒక్కరము వ్యక్తిగతముగ క్రైస్తవులమని పిలువబడవలెను. దేవుని శరీరమైన సంఘము లేక కుటుంబము క్రీస్తు సంఘముగా తెలియపరచబడవలెను. క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి(రోమా 16:16). తండ్రి పేరునుబట్టి పిలువబడుటకు యిష్టపడని కుటుంబ సభ్యులవలె దేవుని కుటుంబమైన సంఘ సభ్యులు క్రీస్తు పేరును ధరించుటకు యిష్టపడక పోవుటను గూర్చి ఆలోచించగలరా?

ప్రభువు ఆయన ప్రజలకు అధిపతిగా యుండి వారిని కాపాడుచు, నడిపించుచు, వారి ఆత్మీయ అవసరత లన్నియు తీర్చుచు మంచి ఫలములు ఫలించునట్లు వారికి తగిన పని అప్పగించుచు, ఆయన

చిత్తమునకు వ్యతిరేకముగ నడచువారిని లేక భేదములు కల్పించు వారిని, అక్రమముగ నడచువారిని దండించి, శిక్షించును. ఆయన బిడ్డల యెడల ఆయనకుండిన ప్రేమను బట్టి వారిని శిక్షించి, దండించును. నా కుమారుడా! ప్రభువు చేయు శిక్షను తృణీకరించకుము. ఆయన నిన్ను గద్దించినపుడు విసుకకుము. ప్రభువు తాను ప్రేమించు వారిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును అని కుమారులతో సంభాషించినట్లు మీతో సంభాషించు ఆయన హెచ్చరికను మరచితిరి. శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులనుగా మిమ్మును చూచుచున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు ! కుమారులయిన వారందరు శిక్షలో పాలు పొందుచున్నారు; మీరు పొందని యెడల దుర్బీజులేకాని కుమారులు కారు. మరియు శరీర సంబంధికులైన తండ్రులు మనకు శిక్షకులై యుండిరి. వారియందు భయభక్తులు కలిగియుంటిమి. అట్లయితే ఆత్మలకు తండ్రియైన వానికి మరి యెక్కువగా లోబడి బ్రతుకవలెనుగదా. వారు కొన్ని దినములు మట్టుకు తమ కిష్టమువచ్చినట్లు మనలను శిక్షించిరి గాని మనము తన పరిశుద్ధతలో పాలు పొందవలెనని మన మేలు కొరకే ఆయన శిక్షించుచున్నాడు. మరియు ప్రస్తుతమందు సమస్త శిక్షయు దుఃఖకరముగా కనబడునేగాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము గలవారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును (హెబ్రీ 12:5-11).

అయితే ఈ దినములలో దేవుని కుటుంబము యెట్టి పరిస్థితులలో నున్నది? అది ఆత్మీయ కుటుంబమువలె ప్రపంచమంతయు ఆవరించి నిక సంఘ సభ్యులద్వారానే అది నడిపింపబడుచున్నది. క్రీస్తు అధికారిగా ఒకే కుటుంబము గలదు. ఆ సంఘములో అనేకమంది సభ్యులుందురు. ఆ కుటుంబము, ఆ కుటుంబములోని వ్యక్తులు ఒక్కొక్కరు

కూడ క్రీస్తు నామమునే ధరింతురు. క్రీస్తునందు సహోదర, సహోదరీలముగా మనము ఒకరినొకరు ప్రేమించుకొనుచూ, సహాయము చేసికొనుచూ, క్రీస్తుకొరకు కలిసి పనిచేయవలెను. మనలో ఒకరినొకరము తగవులాడుకొనక, వ్యతిరేకించుకొనక ఒకరిని గూర్చి మరియొకరు చెడుగు మాట్లాడక, ఒకరి తప్పులు మరియొకరు ఎంచక మున్నగు కార్యములను చేయక దూరముగా యుండవలెను.

దేవుని చిత్తానుసారమైన శారీరక కుటుంబముకంటె గాని ఆత్మీయ కుటుంబముకంటె గాని సౌందర్యమైనట్టిది లేదు. ఒక మంచి కుటుంబములోని సభ్యులముగా మనముండుట యెంత గొప్ప ధన్యత! బైబిలు గ్రంథములో మనము చదివిన రీతిని దేవుని కుటుంబ సభ్యులముగ మనముండుటను బట్టి మనము ఎంతో కృతజ్ఞులము గదా. నీవు ఆ కుటుంబ సభ్యుడవు కానిచో దేవునికి నీవు లోబడి దేవుని సంఘములోనికి నీవు తిరిగి జన్మించినట్లయిన నిన్ను దేవుని సంఘమందుచేర్చును. ఒకసారి నీవు దేవుని సంఘమందు చేర్చబడినట్లయిన సంఘ క్షేమాభివృద్ధి కొరకు, దేవుని మహిమకొరకు ఆ సంఘమునకు సహాయము చేయవలెను.

ఆయన బిడ్డలైన కుటుంబముతో క్రీస్తు యిట్లు వాగ్దానము చేయుచున్నాడు: "మీ హృదయములను కలవరపడనియ్యకుడి, దేవుని యందు విశ్వాసముంచు చున్నారు నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు గలవు, లేనియెడల మీతో చెప్పుదును, మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:1-3).

—o—

# మన స్వాస్థ్యము
## (Our Inheritance)

ఒక వ్యక్తి తన పితరుల ద్వారా తనకు కలిగినట్టి లక్షలకొలది ద్రవ్యమును ఒక సంవత్సరము లోపుననే ఖర్చు చేయుటను బట్టి వార్తా పత్రికలు అతనిని గూర్చి ప్రచురము చేసాయి. ఆ వార్త చదివిన వారికి నమ్ముటకు ఆ విషయము అసాధ్యముగ తోచినప్పటికిని అది ఆలాగు జరిగెను. మనలో అనేకమంది అంత యెక్కువ ధనమును ఎన్నడును చూచి యుండరు.

ధనముతో కొనలేనట్టి మిక్కిలి విలువైన స్వాస్థ్యము క్రైస్తవునికి గలదని బైబిలు గ్రంథము బోధించుచున్నది. పౌలు రోమా 8:16-17 లలో ఈ విధంగా చెప్పుచున్నాడు: "మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతోకూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము దేవుని పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతోకూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమ పడినయెడల, క్రీస్తు తోడి వారసులము".

సహోదరులు టామ్ హాలండ్ మొదటి పేతురు పత్రికయొక్క మూల సిద్ధాంతము "శ్రమలలో నిరీక్షణ" యని చెప్పెను. ఈ మొదటి పేతురు పత్రికలో పేతురు క్రైస్తవునియొక్క స్వాస్థ్యమును మూల సిద్ధాంతముగ ఉపయోగించెను. 1 పేతురు 1:3-4 లో పేతురు ఈ విధంగా చెప్పుచున్నాడు: "మన ప్రభువగు యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడును గాక. మృతులలోనుండి యేసుక్రీస్తు తిరిగి లేచుటవలన జీవముతోకూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు, అనగా అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యం మనకు కలుగునట్లు, ఆయన తన విశేష కనికరము చొప్పున మనలను మరల జన్మింపజేసెను".

# అక్షయమైనది

పేతురు నిర్మలమైన స్వాస్థ్యమును గూర్చి మనకు చెప్పుచున్నాడు. అనేకమంది ఈ మాటను "అక్షయమైనదిగా" తర్జుమా చేసిరి. ఒక సంవత్సరము లోపులో ఒక మనుష్యుడు వ్యర్థముగా ఖర్చుచేయు ధనమునకు వ్యతిరేకమైన స్వాస్థ్యము మనకు క్రీస్తు ప్రభువునందున్నది. మన స్వాస్థ్యము తరిగి పోనట్టిది. మనము ఎల్లప్పుడూ మన తండ్రియైన దేవునితో నిత్యజీవమును అనుభవించగలము. ఒక సంవత్సరము, లేదా ఒక శతాబ్దము లేదా వెయ్యి సంవత్సరములు మనకు ఆ నిత్యజీవానందమును దేవుడు యిచ్చుట లేదు కాని, ఆయన యందు విశ్వాసముంచువారికి అక్షయమైన నిత్య జీవానందమును ఆయన అనుగ్రహించును.

లూకా 15వ అధ్యాయములో తప్పిపోయిన కుమారుడు తన స్వాస్థ్యమును పొందెను, అయితే అతడు తన ఆస్థిని దుర్వ్యాపారము వలన పాడుచేసెను (లూకా 15 : 13). ఎంతో కాలము గడువక మునుపే ఆ యౌవ్వనునికి యేమియు లేకపోయెను. ఈలోక సంబంధమైన ధనమును బట్టి కలిగే అశాశ్వతమైన ఆనందమును అనుభవించుటకు అతడు తన ధనమును నమ్ముకొనెను. దానికి వ్యతిరేకముగ ప్రభువైన యేసు ఈ విధముగ చెప్పుచున్నాడు. భూమిమీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇచ్చట చిమ్మెటయు, తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలెదరు పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనము ఎక్కడ ఉండునో అక్కడనే నీ హృదయముండును (మత్తయి 6 : 19-21). అక్షయమైనట్టి స్వాస్థ్యమును సంపాదించుకొనునట్లు దేవుని బిడ్డలైన వారు పని చేయవలెను.

## నిర్మలమైనది

మన స్వాస్థ్యము నిర్మలమైనది అనగా మన స్వాస్థ్యము ఏ లోపము లేనట్టి పవిత్రమైనదని యర్థము. న్యాయస్థానములో బలమైన సాక్ష్యాధారములు లేని అంశములను కొట్టి వేయుదురు. దేవుని యొక్క స్వాస్థ్యములో అట్టి బలహీనమైన మాట యేమియు ఉండదు; ఎందుకనగా ప్రతిమాటయు దైవావేశము వలన కలిగినట్టిది. దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది (II తిమోతి 3:16-17). బైబిలు గ్రంథము మనుష్యుల ఉద్దేశములను బట్టి వ్రాయబడిన గ్రంథము కాదు. శాస్త్రయుక్తముగా వారి యిచ్ఛనుబట్టి వ్రాసినది కూడ కాదు. ఒకడు తన ఊహానుబట్టి చెప్పుట వలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము యెప్పుడును మనుష్యుని యిచ్ఛనుబట్టి కలుగలేదు గాని, మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి (II పేతురు 1 : 20-21). బైబిలు గ్రంథము దేవునిచేత ప్రేరేపింపబడిన వారిచే వ్రాయబడిన గ్రంథము. యేసుప్రభువు సాతానుతో ఈ విధంగా చెప్పుచున్నాడు. "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని, దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును" (మత్తయి 4 : 4). దేవునియొక్క వాగ్దానములు ఆయన మాటలలో యున్నందున మనకు బలమైన ఆదరణ వాటిద్వారా కలుగుచున్నది. ఈ విధముగ దేవుడు తన సంకల్పము నిశ్చలమైనదని ఆ వాగ్దానమునకు వారసులైన వారికి మరి నిశ్చయముగా కనుపరచవలెనని ఉద్దేశించినవాడై, తాను అబద్ధమాడజాలని నిశ్చలమైన రెండు సంగతులను బట్టి, మన యెదుట ఉంచబడిన నిరీక్ష

ణను చేపట్టుటకు శరణాగతులమైన మనకు బలమైన ధైర్యము కలుగు నట్లు ప్రమాణము చేసి వాగ్దానమును ధృఢపరచెను (హెబ్రీ 6 ; 17-18). మానవులు తమ స్వాస్థ్యము కొరకైన వీలునామాల నరిగ వ్రాయబడని మాటలను బట్టి ఒకరి నొకరు మోసము చేసికొం దురు. దేవుని మాటలలో అట్టిది యుండదు. కనుక మనకు కలిగిన స్వాస్థ్యము నిర్మలమైనదని మనకు తెలియును (హెబ్రీ 13 : 8; 6:17-18; 7:16).

## వాడబారనిది

క్రీస్తునందు మనకు కలిగిన స్వాస్థ్యము యెన్నడును వాడబారనిది. ఆస్థి పట్టాలపై వ్రాయబడిన సిరాను ఒక్కసారి జ్ఞాపకము చేసికొందము కాలము గడిచేకొలది ఆ సిరావ్రాత పాడై పోవుచుండును. అప్పుడు అది తిరిగి వ్రాయవలసి వచ్చును. సమయము మానవులకు అనేక మైన మార్పులను దెచ్చును. కాలము గడుచుచున్నకొలది అవిశ్వాసు లైనవారు కొంత నిరీక్షణ కలిగి తమ పాపములను మరచిపోయిన వారితో సహవాసము చేయుదురు. దేవుని యందు నిరీక్షణ గలవారు తమ పాప జీవితమును మరచి పోవుదురు. ఇట్టివారందరు వ్యర్థమైన నిరీక్షణను కలిగి యున్న వారు.

మానవులచే చేయబడిన వాగ్దానములు అనేక సార్లు నెరవేర్చ బడవు. ఉదాహరణగ సొలోమోను మహారాజు విషయము. దేవుని ఆలయమును ప్రతిష్ఠించు సందర్భములో సొలొమోను రాజు దేవుని తనయొక్క విశ్వాసమును, తన ప్రజలయొక్క విశ్వాసమును గూర్చి వాగ్దానము చేసెను (1 రాజులు 8 : 59-61). అయితే 1 రాజులు 11:1-2 లో సొలొమోను రాజు దేవునికి చేసిన వాగ్దానమును గూర్చి తప్పిపోయెను; అందునుబట్టి రాజ్యము అతని చేతినుండి తీసి వేయబడెను.

దేవుని వాగ్దానములు యెన్నటికిని మారవు. యాకోబు ఈ విధముగా వ్రాయుచున్నాడు: "శ్రేష్ఠమైన ప్రతి యీవియు, సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబంధమైనవై జ్యోతిర్మయుడగు తండ్రియొద్ద నుండి వచ్చును. ఆయనయందు యే చంచలత్వమైనను, గమనాగమనములవలన కలుగు ఏ ఛాయయైనను లేదు" (యాకోబు 1:17). దేవునియందు యే చంచలత్వమైనను లేదు. ఆయన మానవునివంటి వాడు కాడు. మానవులైతే కొంత కాలము కొన్ని విషయములలో మంచిగ యుండిన మరికొంత కాలము వారు చెడుగుగ ప్రవర్తించుదురు. దేవుని విషయములో అట్లు యెన్నడును జరుగదు. ఆయన యెన్నడును మారనివాడు. ఏ చంచలత్వమైనను, గమనాగమనముల వలన కలుగు ఏ ఛాయయైనను లేనటువంటివాడు రెండువేల సంవత్సరముల క్రిందట యే వాగ్దానములు దేవునిద్వారా చేయబడెనో, అదే వాగ్దానములు నేటికిని మనకున్నవి. ఒక మనుష్యుడు ఎంతలో నిలువబడుటద్వారా తన నీతను ప్రదర్శించగలడు; కొంచెము ప్రక్కకు తిరుగుటద్వారా దానిని మార్చగలడు. దేవుడు తాను చేసిన వాగ్దానముల విషయములో గాని, వాటిని నెరవేర్చుటకు ఆయన నియమించిన షరతుల విషయములోగాని యెట్టి మార్పును చేయలేదు. "ఎన్నటికిని వాడబారని గులాబీ పూవులు గల దేశము" అనే పాటవలె దేవునియొక్క వాగ్దానము లున్నవి. అవి ఎన్నటికిని మారవు.

పేతురు ఈ విధంగా చెప్పుచున్నాడు. మృతులలోనుండి యేసు క్రీస్తు తిరిగి లేచుట వలన జీవముతోకూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు, అనగా అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు, ఆయన తన విశేష కనికరము చొప్పున మనలను మరల జన్మింపజేసెను (1 పేతురు 1:4). ఇది రెండు విషయములను మనకు తెలియపరచుచున్నది. మొదటిది దేవునిదృష్టిలో

సమస్త కార్యములు సిద్ధపరచబడినవి. దేవునియందు విశ్వాసముగల వారికి అనగా ఆయన ఆజ్ఞలను విధేయతతో గైకొనువారికి ఆయన అనుగ్రహించు స్వాస్థ్యము నిశ్చయమైనది. రెండవదిగ ఆయన మన కొరకు సిద్ధపరచిన స్వాస్థ్యము యింకను మన కనుగ్రహింపబడలేదు. మనము యిదివరకే ఆ స్వాస్థ్యమును పొందియుండిన ట్లయిన దేవుడు మనకొరకు ఎందుకు స్వాస్థ్యమును సిద్ధపరచవలసి వచ్చును? ఆ స్వాస్థ్యమును యింకను మనము పొందియుండలేదని పౌలు తెలియబరచుచున్నాడు (ఫిలిప్పీ 3:10-13).

## సిద్ధపరచబడినది

మన స్వాస్థ్యము సిద్ధపరచబడి యున్నదని పేతురు చెప్పుచున్నాడు గదా (1 పేతురు 1:4). మనస్వాస్థ్యమును దేవుడు కాపాడుచున్నాడు. ఈ భూమిమీద మనము నమ్మకముతో, విశ్వాసముతో, విధేయతతో ఆయన ఆజ్ఞలను, కట్టడలను గైకొనుచు మన పనులను విజయవంతముగ నిర్వర్తించి ముగించినచో మన కొరకు సిద్ధపరచబడిన, కాపుచేయబడుచుండిన ఆ స్వాస్థ్యమును మనము పొందగలము.

స్వాస్థ్యమును పొందుటలో యెట్టి సందేహమును లేదు. పరలోకమందు మీ కొరకు స్వాస్థ్యము సిద్ధపరచపడి యున్నదని పేతురు చెప్పుచున్నాడు. "మీ కొరకు" అని చెప్పుటలో దేవుడు తన వ్రేలిని నీ వైపు చూపించుచూ నా బిడ్డా! ఆ స్వాస్థ్యము నీదే, నీ కొరకే అని చెప్పుచున్నట్లున్నది.

ఎవరైతే మారుమనస్సు పొంది తమ విశ్వాసమును ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొంది, విశ్వాసముతో ఆయనను అంగీకరించి, సేవించెదరో అట్టి వారందరి కొరకు పరలోకములో ఆయన స్వాస్థ్యము సిద్ధపరచి యుంచును.

మరణము వరకు నమ్మకముగా యుండుము. నేను నీకు జీవకిరీట మిచ్చెదను (ప్రకటన 2:10). మరణము వరకు విధేయతతో, విశ్వాసముతో ఆయనను వెంబడించేవారికి ఆ స్వాస్థ్యము అనుగ్రహింపబడును. తండ్రియైన దేవునినుండి ఆ స్వాస్థ్యమును పొందేవారి వరుసులో నీ వుంటివా? దానిని పొందుటకు దేవుడు తగిన యేర్పాట్లన్నియు చేసియున్నాడు. ఆయన ఆజ్ఞలను గైకొనుటద్వారా నీవు ఆ స్వాస్థ్యమును సంపాదించుకొన ప్రయత్నించుము.

—జాన్ హెన్సన్.

—o—

## ఆరాధన

ఆరాధన అనగా సేవించుట, పూజించుట అని అర్థము. దేవుడొక్కడే ఆరాధింపబడుటకు అర్హుడయినవాడు. "నీ దేవుడయిన యెహోవాకు భయపడి ఆయనను సేవించి ఆయన పేరట ప్రమాణము చేయవలెను" (ద్వితీ 6:13; 5:7; ప్రకటన 22:8). మనము ఈనాడు 20వ శతాబ్దములో అడుగుపెట్టి అనేక శాస్త్రీయ, సాంఘిక, విద్యా వైజ్ఞానిక రంగములలో ఎంతో అభివృద్ధి చెందుచున్నప్పటికి, దేవుని దేవునిగా గుర్తించి ఆరాధించు విషయములో అనేకులు చాలా వెనుకబడి యున్నారు. కనుకనే దైవ గ్రంథము ఇట్లనుచున్నది. "మరియు వారు దేవుని ఎరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి (రోమా 1:21-23).

ఒకప్పుడు మన దేశ జనాభా మూడుకోట్లు ఉన్నప్పుడు, ముక్కోటి దేవతలు ఉన్నట్లుగా భావించిరి. కాని ప్రస్తుత మన దేశ జనాభా సుమారు 80 కోట్లకు పెరిగినది అంటే ఇప్పుడు దేవతల సంఖ్య ఇంకో 77 కోట్లకు పెరిగిందని చెప్పుకొనవచ్చు. భారతదేశములో దిన

నిజము క్రీస్తు దేవుని పుట్టుక ఒక విచిత్రం. అనేకమంది తలంచు చున్నట్లుగా మనకు అనేకమంది దేవుళ్ళు లేరు కాని ఒకేఒక్క దేవు డున్నాడు. "ఆకాశమందైనను భూమిమీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడు ఉన్నాడు. ఆయన తండ్రి; ఆయన నుండి సమస్తమును కలిగెను; ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే ఆయన యేసుక్రీస్తు; ఆయనద్వారా సమస్తమును కలిగెను; మనము ఆయనద్వారా కలిగినవారము. అయితే అందరియందు ఈ జ్ఞానము లేదని అతి స్పష్టముగా చెప్పబడినది (1 కొరింథి 8.6-8). భూమిమీద ఎన్నో శక్తులున్నను వాటిని మించిన శక్తిగలవాడు యేసుక్రీస్తు ఒక్కడే (యోహా 1 : 10; కొలస్స 1 : 16; హెబ్రీ 1 : 2). ఆయన సర్వశక్తి గలవాడు (ఆది 17 : 1). ఆయనకు అసాధ్యమైనది ఏదియు లేదు (మత్త 19:26).

ఆయన "సర్వాంతర్యామి". అంతటా ఉండువాడు, నిత్యము ఉన్నవాడు (యిర్మియా 23.23, 24). "పర్వతములు పుట్టక మునుపు భూమిని లోకమును నీవు పుట్టింపక మునుపు యుగయుగములు నీవే దేవుడవు (కీర్తన 90 : 2; 1 తిమో 2 : 5-6). ఇట్టి దేవుడే ఆరాధనకు పాత్రుడు. ఆరాధనకు పాత్రుడగు దేవుని ఆరాధించుటవలన ఆశీర్వాద ములు కలుగును. అనర్హులైన వారిని పూజించినచో శాపము వచ్చును.

## మానవకల్పితమైన వాటిని ఆరాధించకూడదు :—

కర్నాటక రాష్ట్రంలోని దక్షిణ కన్నర జిల్లాలో నివసించే ప్రజలు ద్రావిడ సంస్కృతిమీద ఆధారపడి 350 రకాల దయ్యాలను పూజి స్తారు. అంతేగాక ఆత్మత్యాగము చేసుకొన్న స్త్రీలను దేవతలుగా పూజిస్తారు. వారు చెట్లను, పందులను, రాళ్ళను పవిత్రముగా భావించి పూజిస్తారు. వీరు ముఖ్యముగా భూతనాధుని, స్త్రీ దేవతలను పురుష ఆకారములో బొమ్మలు చేసి పూజిస్తారు. డిశంబరు-మే నెలల మధ్య

మాత్రమే గుడిని తెరుస్తారు. అట్టివారు "దేవుని సత్యమును అసత్యమునకు మార్చి, సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి. యుగయుగముల వరకు ఆయన స్తోత్రార్హుడై యున్నాడు ఆమెన్ !" (రోమా 1:25). దేవాదిదేవుడు విగ్రహారాధనను సంపూర్తిగా ఖండించెను (యెహెజ్కేలు 14:16, 1 యోహాను 5 : 21, యెష 2 : 8, 9). విగ్రహారాధికులు నరకపాత్రులని హెచ్చరించెను (ప్రకటన 21:8). "శిలల ప్రతిమ జేసి చీకటింటను బెట్టి మ్రొక్కవలదు; వెఱ్ఱిమూఢులారా యెల్లమందు బ్రహ్మ యుండుట దెలియదు విశ్వదాభిరామ వినుర వేమ". రాయిరప్పలను బొమ్మలుగా చేసి ఒకమూల పెట్టి దేవుడని మొక్కే మూఢులారా మీ హృదయమే దేవుని నిజమైన స్థానమని గ్రహించలేని వారలారా అని చెప్పి వేమన ఖండించెను. కొరింథులోని క్రైస్తవులకు పరిశుద్ధాత్ముడు ఈలాగు చెప్పెను: "మీరు దేవుని ఆలయమై యున్నారనియు దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా" (1కొరింథీ 3:16). "రాళ్లు దేవుండ్లయితే రాసులుమింగవా!" అని యోగి వేమన విగ్రహారాధన పాపమని నిరూపించెను. భారతీయులలో కోకొల్లలుగా విగ్రహారాధనను వ్యతిరేకించిన సంఘ సంస్కర్తలు జన్మించిరి. "కోటి బ్రహ్మలకన్న కోడిపుంజు మేలయా! ఇంటి దేవతకన్న యెంతో కుంటి కుక్క మేలయా" అని మహా రచయిత నుడివెను.

పాపములను పరిహరించగల శక్తి ఒక్క యేసుక్రీస్తుకే కలదు. ఎందుకనగా ఆయన మన పాప విమోచనకై శిలువపై మరణించి, మరణాన్ని జయించిన మృత్యుంజయుడు. "మృతి గెలిచినవాడే దురిత జీవుల బ్రోవదగును. అన్నా మన యేసు ప్రభువుకన్నా రక్షకుడు లేడు" అని పురుషోత్తమ చౌదరి పాడెను.

1933వ సంవత్సరమున మద్రాసు నగరమందు హైందవ మిష

వరీమైన రామకృష్ణ పరమహంస ప్రచురించిన LOTUS అను మా
పత్రికలో యేసుక్రీస్తు వర్తమాన, భూత, భవిష్యత్ లను ఎరిగినవా
అని నిష్కర్షగా చెప్పెను. కనుక ప్రియ సహోదరి సహోదరుడా నీవు
నేను, మనమందరమూ సృష్టికి విధాత, ఆది సంభూతుడు, అదృశ్యు
డైన దేవుని స్వరూపియైన (కొలస్స 1:15-17) యేసుక్రీస్తుని వాక్యం
విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము
బాప్తిస్మము పొంది క్రీస్తు సంఘములో చేర్చబడి ఆయనను ఆత్మ
తోను సత్యముతోను ఆరాధింతము. "కాబట్టి సహోదరులారా, పరి
శుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరము
లను ఆయనకు సమర్పించుకొనుడి" (రోమా 12 : 1; 1 కొరింథి
11 అధ్యా 14 అధ్యా). క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు
చెబుచున్నవి.

పి. చంద్రశేఖర్,
కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, కాకినాడ-4

---

## దేవుడున్నాడంటే నీ వాదమేమో కాని....

ఆయన అదృశ్యుడనేది వాస్తవం! అదెలా నిజమనే సందేహం వస్తుందేమో! బాహ్య ప్రపంచంలో కంటికి కన్పించనివి ఎన్నో ఉన్నాయ్. కంటికి కన్పించనంత మాత్రాన అవి లేవని చెప్పడం అర్థరహితం. కంటికి కనబడకయే ఉన్న వాటిని అదృశ్య వాస్తవాలంటారు. కంటికి మాత్రమే కాదు; పంచేద్రియాలలో మిగిలిన వాటికి సహా (అంటే-ముక్కు నాలుక, చెవి, చర్మం అనే మిగిలిన వాటికి కూడా) అందని వాస్తవాలు ప్రకృతిలో అనేకాలున్నాయ్. విద్యుత్తు (electricity), ఈథర్ (ether) మొదలైనవి యిలాటి వాస్తవాలే.

## అదృశ్యంగా ఉన్న భౌతిక వాస్తవాలు :

ఆయా పరిస్థితులను బట్టి కొన్ని వాస్తవాలు అదృశ్యంగా ఉన్నాయ్. మనకు వ్యాధిని కలిగించే పలురకాల సూక్ష్మ జీవులు వాటి పరిమాణాన్ని బట్టి అదృశ్యంగా ఉన్నాయ్. ఆకాశ మహా విశాలంలో వున్న అనేక నక్షత్రాలూ, నక్షత్రరాసులూ వాటి దూరాన్ని బట్టి అదృశ్యంగా ఉన్నాయ్. ఆయా పరికరాల ద్వారా వాటి ఉనికినీ, చర్యలనూ గుర్తించవచ్చు. గత కాలంలో మానవుడు లేవని భ్రమించిన అనేక విషయాలు ఆధునిక యంత్ర సహాయంవల్ల నేటి మానవుడు చూడగలుగుతున్నాడు. దాదాపు అవన్నీ భౌతిక పదార్థాలకు సంబంధించినవే.

## భౌతికంకాని అదృశ్య వాస్తవాలు :

అయితే భౌతిక పదార్థాలకు సంబంధింపకయే కొన్ని వాస్తవాలు అదృశ్యంగా ఉన్నాయ్. అవెక్కడున్నాయని అడుగుతావేమో! మానవ దేహంలో నివసించే ప్రాణాన్ని గూర్చి నీకేంతోస్తుంది? అది అదృశ్యంగావున్నా, వాస్తవంకదా! సకల జీవుల్లో ప్రాణమున్నా, అది ఏరూపంలో ఉందో, ఏపరిమాణంలో ఉందో ఎవరికీ తెలియదు. మృత దేహానికి ఏ అవయవ లోపం లేకపోయినా, దానిలో సజీవ చర్యలు లోపిస్తాయ్. సజీవ చర్యలవల్లనే ప్రాణంయొక్క ఉనికిని తెలుసుకోగలుగుతున్నాం. వాటికి వేరుగా దేహంలో ప్రాణమున్నట్లు తెలుసుకోగలమా? "ప్రాణం" కూడా అదృశ్యవాస్తవమే. గనుక, అది దేహాన్ని వదలిపోయేటప్పుడు ఏ రూపంలో, ఏలాగు వెళ్ళుతుందో కూడా తెలియకుంది.

అలాగే మానవ దేహంలో పదార్థానికి సంబంధించని మరికొన్ని అదృశ్య వాస్తవాలున్నాయ్. ఆత్మయొక్క ఉనికిని అంగీకరింపని

"అణోమయవాదులు" కూడా, "మనస్సు, హృదయం" అనే వా
టాలను కాదనలేరు. హృదయం "గుండెకాదు". మనస్సనేది - మెద
కాదు. ప్రాణం తన చర్యలవలన తన ఉనికిని ఎలా ప్రత్యక్షపరచు
కొంటుందో, అలాగే "హృదయం, మనస్సు" అనేవి కూడా త
ఉనికిని బయలుపరచుకొంటున్నాయ్. నిజానికి హృదయం, మనస్సు
లనేవి అంతరంగ పురుషుని వంటివే.

మానవదేహంలో నివసించే ప్రాణం, మనస్సు హృదయం అ
వాటిని బట్టి పదార్థానికి సంబంధించిన రూపం లేకుండానే అదృశ్య
వాస్తవాలు ఉన్నాయనీ, వాటి ఉనికి కేవలం వాటి చర్యలవల్ల
గుర్తింపగలమనీ, వాటి చర్యలకు వేరుగా అవి వున్నట్టు తెలుసుకు
అవకాశమే లేదని తేలిపోయింది.

## దేవుడు ఆత్మ గనుక అదృశ్యుడు :

అలాగే దేవుడు ఆత్మ (యోహాను 4 : 24). గనుక ఆయ
అదృశ్యుడనేది వాస్తవం. పదార్థరహితమైన వాస్తవాలవలెనే దేవు
కూడా తన ఉనికిని, తాను నిర్మించిన సృష్టిద్వారా ప్రత్యక్షపరచు
కొంటున్నాడు. "ఆకాశములు (అట్టి) దేవుని మహిమను వివరించు
చున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది"
(కీర్తన 19:1).

## విద్యుత్తును అదృశ్యవాస్తవంగా గుర్తించాలి :

తన స్వరూప స్వభావాన్ని బట్టి దేవుడే కాదు; తన నిజ స్వరూ
పాన్ని బట్టి విద్యుత్తు (electricity) కూడా అగోచరమయిందే
అనుకున్నాం కదూ! నీకు తెలుసో లేదో కాని, విద్యుత్తుతో నిరంతర
సంబంధం గల ప్రముఖ మేధావులు సయితం, దాని ఉనికిని దాని

చర్యలద్వారానే తెలిసికోగలుగుతారు. విద్యుత్తంటే - పంకా కాదు, అగ్ని కాదు; వేడికాదు; యంత్రం కాదు ; షాకుకాదు. అయితే అది తన ఉనికిని దీపాలు వెలిగించడం, మంట మండించడం; వేడి పుట్టించడం; యంత్రాన్ని నడిపించడం; దాన్ని తగినట్టు సమీపించక పోతే-షాకు కొట్టడం లాంటి చర్యలద్వారా విద్యుత్తు తన్ను తాను ప్రత్యక్ష పరచుకొంటుంది. అలాగే దేవుడు కూడా తన ఉనికిని తాను నిర్మించిన సృష్టిద్వారా బయలుపరచుకొంటున్నాడు.

## అదృశ్యవాస్తవాలను నిరాకరించడమా ?

విద్యుద్దీప కాంతిలో (under an electric light) తన పుస్తకాన్ని చదువుతూ, విద్యుత్ పంకా క్రింద కూర్చుండి దాని గాలిని అనుభవిస్తూ - "కరెంటు లేదు" అని అన్నవాణ్ణి నీవెప్పుడైనా చూచావా? అలాంటివాడు ఒకవేళ నీకు ఎదురైతే వాణ్ణి నీవేమంటావ్! అయితే సూర్యుని వెలుగు, చంద్రుని కాంతి గాలి, వర్షం మొదలైన వాటిని అనుభవిస్తూనే - దేవుడు లేడనే వానిని గూర్చి మరి నీవేమంటావో.

## దేవుని ఉనికిని నిరాకరించేవారు ఆలోచింపరు :

"దేవునికి కోపము పుట్టించువారు నిర్భయముగా నుందురు. వారు తమ బాహుబలమే తమకు దేవుడనుకొను చుందురు. అయినను మృగములను విచారించుము అవి నీకు బోధించును. ఆకాశ పక్షులను విచారించుము అవి నీకు తెలియజేయును. భూమిని గూర్చి ధ్యానించిన యెడల అది నీకు బోధించును. సముద్రములోని చేపలు నీకు దాని వివరించును. వీటన్నిటిని బట్టి యోచించుకొనిన యెడల యెహోవా హస్తము వీటిని కలుగజేసెనని తెలిసికొనలేని వాడెవడు? జీవరాసుల ప్రాణమును మనుష్యు లందరి ఆత్మలును ఆయన వశమునందున్నవి గదా" (యోబు 12:6-10).

## దేవుని ఎరిగిన నిరాకరించేవారు నిరుత్తరులు :

"దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది; ఎందుకనగా దేవునిగూర్చి తెలియశక్యమైనదేదో అది వారి మధ్య విశదమైయున్నది. దేవుడు అది వారికి విశదపరచెను. ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృజింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటబడుచున్నది గనుక వారు నిరుత్తరులై యున్నారు" (రోమా 1:18-20).

## పునరాలోచన చేయ్ :

దేవుని గూర్చిన వాస్తవం ఎలా తేటబడుతుంది? "జగదుత్పత్తి మొదలుకొని సృజింపబడిన వస్తువులను ఆలోచించుటవలన". వాటిని ఆలోచించడంవల్ల ఏం తేటబడుచున్నాయ్! ఆయన అదృశ్య లక్షణాలు, అంటే ఆయన నిత్యశక్తి దేవత్వమూ తేటబడుతున్నాయ్. గనుక ఆయన లేడని అనడానికి వీల్లేదు. కంటితో లేక మిగిలిన పంచేంద్రియాలతో అగోచరమైన వాటిని లేవనడం ఎలా అర్థరహితమో, అలాగే తన స్వరూప స్వభావాన్ని బట్టి అదృశ్యుడై యున్న దేవుడు లేడని భావించడం అర్థరహితం.

"శ్రీమంతుడు అద్వితీయుడునగు సర్వాధిపతి యుక్తకాలములయందు ఆ ప్రత్యక్షతను కనుపరచును. ఆ సర్వాధిపతి రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నాడు. సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వముగలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును చూడనేరడు; ఆయనకు ఘనతయు శాశ్వతమైన ప్రభావమును కలిగియుండును గాక. ఆమేన్." (1 తిమోతి 6:15-16).

—G. దేవదానం, బాక్స్ 954, మద్రాసు-12.

# నిన్ను కనిపెట్టు చుండును !

## ( Watching You ! )

"చూచుచున్న కన్ను నిన్ను కనిపెట్టుచున్నది!" అనే ఒక గేదు. బైబిలు గ్రంథములోని అనేక వచనములు దీనికి మూలాధారములుగ యున్నవి. వాటిలో ఒకటి సొలొమోను మహారాజు చెప్పినటువంటిది. "యెహోవా కన్నులు ప్రతి స్థలముమీద నుండును; చెడ్డవారిని మంచివారిని అవి చూచుచుండును" (సామెతలు 15 : 3).

ఎల్లప్పుడు నిన్ను కనిపెట్టి చూచుచుండుటను నీవు యిష్టపడుదువా? నీవు పొరబాటు చేసిన యెడల నిన్ను పట్టుకొని శిక్షించే పోలీసువానివలె నీవు దేవుని గూర్చి ఊహించగలవా? ఏ పాపమునకు మనము లోనుకాకుండునట్లు ఆయన బహు జాగ్రత్తగా మనలను కనిపెట్టి చూచుచున్నాడు. ఆయన సమస్తమును చూచును. దేవుడు విమర్శ చేయునపుడు ఆయన ప్రతిక్రియను అది మంచిదేగాని, చెడ్డదేగాని తీర్పులోనికి తెచ్చును (ప్రసంగి 12 : 14).

పగటివేళ కంటె, రాత్రి జాములయందు యెక్కువ నేరములు, క్రూరత్వములు జరుగును. చీకటిలో తమ పనులు యెవరికి కనబడవు అనే యుద్దేశములో ప్రజలుందురు. కాని రాత్రివేళ యందు స్పష్టముగా చూడగల్గు సాధనములను మానవుడు కనిపెట్టియున్నాడు. జీవించుచున్న దేవుడు చీకటిని బట్టి యే విధముగను ఆటంకపరచబడడు. "ఆయన దృష్టి నరుల మార్గములమీద ఉంచబడి యున్నది. ఆయన వారి నడకలన్నియు కనిపెట్టి చూచుచున్నాడు. దుష్క్రియలు చేయువారు దాగుకొనుటకు చీకటియైనను, మరణాంధకారమైనను లేదు" (యోబు 34:21-22). అని ఎలీహు గ్రహించియున్నాడు. నేరస్థులు, పాపులు, సాక్ష్యములు యిష్టపడరు కాని అధమము ఒక్కటియైన సాక్ష్యముండును.

కాని కొంతమంది ప్రజలు ఎల్లప్పుడు దేవుడు తమ్ము కని పెట్టి చూచుచుండుటకు ఇష్టపడరు. మనము ఏదైనా పొరబాట్లు చేసిన యెడల మనలను పట్టుకొని శిక్షించ వలెనని ఆయన కోరుట లేదు. దానికి బదులు ఆయన చెప్పుచున్నాడు. "నా జీవముతోడు దుర్మార్గుడు మరణము నొందుటవలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గత నుండి మరలి బ్రదుకుట వలన నాకు సంతోషము కలుగును". దేవుడు మనకు ప్రేమగల తండ్రియై యుండి ఆయన బిడ్డలమైన మనకు సహాయము చేయుటకు ఎల్లప్పుడు కనిపెట్టుచుండును. వారి ప్రాణమును మరణమునుండి తప్పించుటకును, కరవులో వారిని సజీవులనుగా కాపాడుటకును యెహోవా దృష్టి ఆయన యందు భయభక్తులు గల వారిమీదను, ఆయన కృపకొరకు కనిపెట్టువారి మీదను నిలుచుచున్నది (కీర్తనలు 33:18-19). తల్లిగాని, తండ్రిగాని ఒక చిన్న బిడ్డను కనిపెట్టి చూచుచుండిన ఆ బిడ్డ ఎంతో క్షేమముగ యుండినట్లు భావించును. అటువలెనె మన పరలోకపు తండ్రియు మనకు కీడును కలుగజేయు అపాయములను కనిపెట్టుచుండును. తన యెడల యథార్థ హృదయముగల వారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది (II దిన 16:9).

దేవునియొక్క కనిపెట్టి చూచు కన్నులను బట్టి నీవు వ్యథ చెందినను లేక క్షేమమని తలంచినను అది నీ ప్రవర్తనపై ఆధారపడి యున్నది.

— రోయస్ ఫ్రెడరిక్.

---

మీరు, మీ కుటుంబ సభ్యులు ఉచిత బైబిలు కరస్పాండెన్సుకోర్సులో చేరండి. ఒక క్రొత్త నిబంధనను ఉచితముగా పొందండి.

ఈనాడే మాకు వ్రాయండి:

SATYA VANI, P.O. Box 80, KAKINADA-533 001.

# సంక్షిప్త వార్తలు

సెప్టెంబరు నెల సువార్తికుల సదస్సు మరియు సువార్త కూటము 24వ తేదీన కాతేరు (రాజమండ్రి) లో జరిగెను. అత్యధిక సంఖ్యలో విచ్చేసిన సువార్తికుల సమక్షంలో "నేడు పరిశుద్ధాత్ముడు ఎట్లు పని చేయుచున్నాడు"? అను అంశము చర్చింపబడెను. ఈ చర్చా కార్యక్రమములు సువార్తికులకు క్షేమాభివృద్ధిని, తర్ఫీదును, ప్రోత్సాహమును కలిగించుటయేగాక ఐక్యతలోనున్న ఆనందము కలిసి పని చేయుటలో నున్న తృప్తి ఎట్టిదో అనుభవ పూర్వకముగా తెలియజేయుచున్నది. పనిచేయని వాహనములు 'వర్క్ షాప్' లో చక్కని రూపాన్ని, పనిచేసే సామర్థ్యాన్ని సంతరించుకొని వెలుపలికి వచ్చునట్లు, ఈ సువార్తికుల కర్మాగారములో, దేవుని వాక్యపు వెలుగులో సువార్తికులు యోగ్యులుగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగ ఉపదేశించు వారిగాను తీర్చి దిద్దబడుచున్నారు. ఎంతో సుందరమైన వీరి పాదాలు సిద్ధమనస్సు అను జోడు తొడుగుకొని అనేకులకు సువార్త నందించుటకు త్వరపడుచున్నవి.

ఉదయం ప్రారంభమైన సమావేశానికి సోదరులు వడ్డి చిన్నయ్యగారు అధ్యక్షత వహించగా సోదరులు పి. సామ్యూల్ రాజుగారు (ఆచంట), పి. మాణిక్యాలరావుగారు (పాలకొల్లు), K. గంగాధరరావుగారు (ఆచంట), A. రామమూర్తిగారు (అవిడి), సాయిరాజుగారు (గెద్దాడ), Ch. జాన్‌బాబుగారు (ముంగండ), మరియు పి. సామ్యూల్‌గారు (ఆచంట) చర్చలో పాల్గొనిరి. "నేడు పరిశుద్ధాత్మని పని" అను ఈ ప్రాముఖ్యమైన అంశమును గూర్చి లేఖనములు బోధించు విధము మానవులు గ్రహింపక పోవుటయే అనేక మతశాఖల ఆవిర్భావానికి కారణమయ్యింది. పరిశుద్ధాత్ముడు దేవత్వములో ఒక వ్యక్తి యని యోహా 16:13 లోను ఇంకా అనేక

చోట్ల "ఆయన" అని పరిశుద్ధాత్మని గూర్చి వ్రాయబడినదని చెప్పిరి. క్రీస్తు కొలతలేని ఆత్మను పొందెనని అపొస్తలులు కొలత గల ఆత్మను పొందిరని, అపొస్తలులు ఎవరిమీద చేతులుంచిరో? వారు కూడ అద్భుతములు జరిగించిరని; కాని వీరు మిగిలిన వారిపై హస్త నిక్షేపణము చేయలేదు (1 తిమో 5:22). నేడు అపొ.కా. 2:38 లో చెప్పిన విధముగ పరిశుద్ధాత్మ అను వరము బాప్తిస్మము పొందిన ప్రతివారు పొందుచున్నారని యిది 'నివసించు ఆత్మ' యని (II తిమో 1:14) ఈ ఆత్మ ఫలములను ఫలించునని (గలతి 5:22) చెప్పిరి.

మధ్యాహ్న సమావేశానికి సోదరులు జి. షడ్రిక్ గారు (పాలకొల్లు) అధ్యక్షత వహించగా సోదరులు T. ప్రకాశరావు గారు (కొమరోలు), E.K.V. ప్రసాదరావుగారు (చెయ్యేరు), పాల్ గూటం గారు (గొల్లవిల్లి) మంచి సందేశమును ఈ అంశముపై అందించిరి. సోదరులు పాల్ గూటంగారు మాటలాడుచు, "క్రీస్తు సంఘస్థులు పరిశుద్ధాత్మను నమ్మరు" అను మాట అబద్ధమని పరిశుద్ధాత్మని ఆదరణకర్తగా, వ్యక్తిగా "ఆయన" అని సంబోధించి పరిశుద్ధాత్మ ప్రేరిత లేఖనములను గౌరవించుచున్న వారము మేమే (క్రీస్తు సంఘస్థులే) నని చెప్పిరి. పై ఆరోపణ చేసేవారు ఆయనను వ్యక్తిగా గుర్తించక ఆయన వ్యక్తిత్వాన్ని (personality) కించపరచుచున్నారని చెప్పిరి.

సోదరులు జాషువా గూటంగారు కొన్ని ప్రశ్నలు వాటికి సమాధానములు చెప్పిరి. 1. మీరు పరిశుద్ధాత్మని నమ్ముచున్నారా? జవాబు: నమ్ముచున్నాము 2. మీరు పరిశుద్ధాత్మను పొందితిరా! జవాబు: అపొ. కా. 2:38 లో పేతురు ద్వారా చెప్పబడిన పరిశుద్ధాత్మ అను వరమును పొందితిమి 3. పరిశుద్ధాత్ముడు నేడు ఎట్లు పని చేయుచున్నాడు? జవాబు: "ఆయన వచ్చి పాపమును గూర్చియు

నీతిని గూర్చియు తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొన జేయును" యోహా 16:8. ఆయన అద్భుతరీతిగ ఈనాడు పని చేయుటలేదు. పరిశుద్ధాత్మ వేళ లేఖనములు ఈనాడు పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పింపజేయును. నేడు పరిశుద్ధాత్ముడు వాక్యము ద్వారా మన మధ్య పని చేయుచున్నాడు. విత్తనము దేవుని వాక్యము. అది ఫలించు ఫలము ఆత్మ ఫలము. విత్తనము విత్తిన వెంటనే ఎవరూ ఫలము నాశింపలేరు. విత్తనము మొక్కగా మారి ఎదిగిన తరువాత ఫలములు ఫలించును. క్రైస్తవ ఎదుగుదలలో పరిశుద్ధాత్మ పని ఉన్నది. వాక్యము శక్తి గలది. ఆ శక్తిని మనము ఉపయోగించుకొనవలసి యున్నది.

4. నీవు ఎట్లు ఆత్మమూలముగా తిరిగి జన్మించ గలవు ?
జవాబు : "మీరు క్షయ బీజమునుండి కాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమూలముగా అక్షయ బీజము నుండి పుట్టింపబడినవారు" (1 పేతురు 1 : 22-23). ఇది నేడు పరిశుద్ధాత్ముని పని. "వాక్య మూలముగా" అను మాట మీరు గుర్తించవలసి యున్నది. మొదటి శతాబ్దములో పరిశుద్ధాత్ముని ద్వారా జరిగిన సూచక క్రియలు దేవుని వాక్యము లిఖించుటలో సహకరించెను. ఆనాడు అపొస్తలుల చేతిలో క్రొత్త నిబంధన గ్రంథము లేదు. వారు సర్వసృష్టికి సువార్త ప్రకటించుటకు అద్భుతములు (Miraculous Manifestation) అవసరమయ్యెను. ఈనాడు నీవు నేను సువార్త ప్రకటించాలంటే పరిశుద్ధ గ్రంథము కావాలి. తన సహజశైలిలో సోదరులు జాషువా గాటుంగారు గొప్ప పాఠాన్ని అందించిరి.

రాత్రి కూటమునకు సోదరులు Ch. జాన్ బాబుగారు అధ్యక్షత వహించగా ఇ. కె. వి. ప్రసాదరావుగారు సువార్త సందేశ మందించిరి. సోదరులు జాషువా గూటంగారు చేసిన "దేవుని అనుగ్రహము మరియు ఆగ్రహము" అను గొప్ప సువార్త ప్రసంగము స్థానికులను విద్యావంతులను సహోదరులను ఆకర్షించెను. జాషువా గూటంగారి ప్రసంగమును ముఖాముఖిగా వినాలని ఆశించిన ఎందరో సభలో నుండుట ఈ సభలో ప్రత్యేకత. కూటము అనంతరము ఆనందముతో అందరు తమతమ గృహాలకు తిరిగి వెళ్ళిరి. రాజమండ్రిలో సోదరులు D.D. ఆశీర్వాదంగారు దేవుని పనిని గొప్ప ఆసక్తితో జరిగించుచున్నారు.

—o—

Regd No. H/KD—45/KD H.O.

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To
..........................................
..........................................
..........................................
..........................................